కూడుకోసం
పరాయిదేశంలో
ఎడారిపాట్లుపడిన
అతడేమయ్యాడు?

# దగాపడ్డ తమ్ముడు




అహోబిలన్ నవ్వుతూ చూశాడు భాస్కర్ రెడ్డిని.

"చూడప్పా! రెడ్డీ! నీకేం భయం తేవ ఇల్ల. నిన్ను 'సౌతీ'కి పంపే పూచీ నమ్మదే. మేం బొంబాయివాళ్ల మల్లెకాదు. పక్కా న్యాయం దా. నీ పణం పువ్వుల్లో పెట్టె ఇచ్చి వేస్తుమ. తేడావచ్చిన..." అహోబిలన్ నోట్లో బంగారపు పన్ను తళుక్కుమని మెరిసింది. అతను లావుగా, నేరేడు పండులా నిగనిగలాడుతూ నల్లగా వున్నాడు. లుంగీ, పైన సిల్కు చొక్కా. కాలరు ఓపెన్‌గా వుంది. లోపల బంగారపు గొలుసు. పులిగోరు చివర్న.

భాస్కర్‌రెడ్డి భయంభయంగా అన్నాడు "నానా కష్టాలుపడి ఈ డబ్బు తెచ్చిన. దుబాయ్‌కి పంపిస్తనని నమ్మకంగా చెప్పిండు హైద్రాబాదులో నా స్నేహితుడు, బొంబాయి బ్రోకర్లది మోసమని, డబ్బు తీస్కొని నడి సముద్రంలో ముంచుతారని అన్నాడు...."

"అదేనప్పా — మీతో పెరియ చిక్కు. నువ్వు బోయేది 'తుబాయ్ కాదు. సౌతీ. నీ ఫ్రెండు కరెక్ట్‌దా" అన్నాడు. అహోబిలన్ మొహంలో కవళికలు కఠినత్వాన్నుంచి పరవశత్వానికి, తర్వాత నిజాయితీకి మారిపోయాయి.

భాస్కరరెడ్డి భయపడ్డాడు. అతని కళ్లల్లో అప్పుడు కనపడిన క్రౌర్యానికి. కాని చేసేదేముంది? అప్పుడే పదివేలు ముట్టచెప్పాడు.

ఉస్మానియాలో ఇంజనీరింగ్ సీటు రాగానే, ప్రపంచానికి ఏకచ్ఛత్రాధిపతిలా ఫీలయ్యాడు. సెమిస్టర్లూ, ఎకడమిక్ ఇయర్లూ



కరిగిపోతుంటే అతని కలలకు దగ్గరయ్యాడు

ఫైనల్ రిజల్ట్స్ వచ్చేసరికి అతని ఆనంద మేమీ మిగల్లేదు. ఆ నాలుగున్నర సంవత్సరా ల కఠినమైన జీవితం, అప్పులూ, తల్లీ తండ్రీ అనుభవించిన దుర్భర దారిద్ర్యం, కల ఫలించిన ఆనందాన్ని హరించివేశాయి. ఇంజనీరింగ్ చదువుతూ, అందరిలా జల్సాగా వుండడాన్కి వనరులు లేవు. అతి

కష్టంమీద తిండికీ, బట్టకీ, ఫీజులకు, తండ్రి పంపే డబ్బుకోసం ఎదురుచూస్తూ మూగ బాధననుభవించేవాడు. మిగిలిన విద్యార్థుల ఊహాశక్తికందని విషయం అతని అనుభవం — ఆ లేమి.

కరీంనగర్‌లో సేద్యపు వసతులు లేని మెట్ట ప్రాంతం. మెతుకు కోసం చినుకు. చినుకుకోసం నిరీక్షణ. నిరీక్షణలోనిరాశ. నిరాశతో దైన్యం — ఇదీ అక్కడి రైతు పరిస్థితి.

హెచ్.ఎస్.సీ ఫస్ట్‌క్లాస్‌న పాసయ్యాడు భాస్కరరెడ్డి. నరసింహాచార్యుల మేస్టారి ప్రోత్సాహం — ప్రోద్బలం వల్ల ఇంటర్‌లో చేరాడు. దాంట్లో మంచి మార్కులొచ్చాయి ఎంట్రన్స్‌లో మంచి ర్యాంకే వచ్చింది. ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది. అనుకున్న లైనుకాదు. సివిల్. ఏం చేద్దామని మాస్టారిని అడిగాడు. ఆయన నిట్టూర్చి అన్నాడు. "పరమాన్నం దొరకలేదని పస్తుండడంకంటె పట్టెడన్నం దొరికితే సరిపెట్టుకోవాలి. ఇంటర్మీడియట్‌తో ఏ పనీ రాదు. ముందు చేరిపో — ఆ తరువాత అన్నీ సర్వేశ్వరుడే చూసుకుంటాడు"

ఇంజనీరింగ్ డిగ్రీ చేతబుచ్చుకుని ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీని, సివిల్ ప్రాజెక్టు ఆఫీసుల్ని దర్శించాడు. "చూడు నవీన యువకా! నీలాంటివాళ్లు చాలామంది ముందే క్యూలో వున్నారు. ఇంజనీరింగ్ పాసై క్లార్కు ఆఫ్ కవర్డ్‌గా వుద్యోగాలు చేస్తున్నారు దానికీ పెద్ద క్యూ. అప్లికేషన్ ఇచ్చి పో. ఖాళీలొస్తే పిలుస్తాం" అని ఒక వృద్ధ జంబూకంలాంటి గుమాస్తా సలహా ఇచ్చాడు.

ఆర్నెల్లు తిరిగేసరికి ఒక విషయం పూర్తిగా అర్థమైంది. ఉద్యోగం అనేది ఒక ఎండమావి. దొరకదు. జీవనోపాధికి ఏదో ఒక పని చేయాలి... అంతే —"

చినుకుపడవలసినప్పుడు పడదు. అవసరంలేనప్పుడు కుండపోతగా కురుస్తుంది. ఆ తల్లి భూదేవికి, రైతు కన్నీటికి స్పందించే శక్తి లేదు. ఆ సంవత్సరం పంట నీటిపాలైంది. భాస్కర్‌రెడ్డి తండ్రి నడుము విరిగింది పంటరుణాలు తీర్చలేక.

అప్పుడు కనపడ్డాడు సదర్‌ఖాన్ బస్సు స్టాండులో. టిప్‌టాప్‌గా వున్నాడు. రేమండ్స్ సూటు, రేబాన్ గాగుల్స్, ఫీనిక్స్ షూస్, సిటిజన్ గోల్డ్ వాచీ.

"అరే! రెడ్డీ! క్యాకర్‌రై యార్! బహుత్ దిన్ హోగయా — అభీభీ చిరంజీవికా పిక్చర్ పహిలా దిన్ దేఖారహాహై "

చిరంజీవి పిక్చర్స్ ఫస్ట్‌డే చూడాలని ఒకే ఒక్క కోరిక తీరకపోయినా సదర్‌ఖాన్ వేళాకోళానికి అది పనికివచ్చింది.

"ఏం లేదు. ఉద్యోగంలేదు. వెతుకుతున్నాను" అన్నాడు దీనంగా. న్యూనత కనపడకూడదని ప్రయత్నిస్తూ, మరింత ఆత్మవిశ్వాసాన్ని ఆ మాటలో తెచ్చుకుంటూ.

"తుమ్ ఐసాకర్" అని సదర్ సలహా ఇచ్చాడు. ఆ సలహా పర్యవసానమే అహోబిలమ్‌తో ఈ పరిచయం.

"రెడ్డీ— సౌదీలో నీలాంటి వాండ్లు పెరియమంది వేణుమ్. నువ్వు పదివేలిస్తే — పాసుపోర్టు — వీసా తెస్తును" అహో[illegible]న్

చాలా మామూలుగా అన్నాడు.

"పదివేలా!" దిగులుగా అన్నాడు భాస్కర్ రెడ్డి.

"ఏమయ్యా! అంత కవలపడుదువు. నీది పదిరోజుల్లో పదివేలు వచ్చును — ఆ తర్వాత నువ్వు కార్లో దానే తిరిగేది"

అందమైన కల భాస్కర్ రెడ్డి కళ్లముందు — మొదటి నెల జీతంతో మంచి బట్టలు, తనకీ, అమ్మకీ, నాయనకీ. రెండో నెల జీతంతో ఇల్లు రిపేరు — ఇల్లు కురవకుండా. .. మూడోనెల — నాలుగోనెల — ఒక సంవత్సరంలో అప్పులు తీరిపోతాయి. ఆ పైన మంచి పొలం కొనుక్కుని — లేదు హైదరాబాదులో మడిగ తీసుక్కుని, లేదు.... ఫ్లాట్ — నో — ఫ్లాట్ —"

"ఏం అప్పా ఆలోచిస్తువు" అన్న అహోబిలన్ మాటతో ఈ లోకంలోకి వచ్చాడు.

"పదివేలు ... ఇన్నాళ్లూ తల్లి గుండ్ల గొలుసు తియ్యలేదు ఎట్టి పరిస్థితుల్లోనూ. తాత పెట్టిన గొలుసు అది. అమ్మనడిగితే ఇవ్వదు. తన పరిస్థితి చెప్పి, ఉద్యోగంలో వచ్చిన డబ్బుతో మళ్లీ కొనవచ్చు అని చెపితే ఇస్తుంది.

"యో ఆండవనే — నాకు సమయుందా లేదు — నేను రేపు బొంబే పోవలె. నీ పాస్‌పోర్టు, వీసా — మళ్లీ మీ కరీంనగర్ వచ్చేది లే" అని అహోబిలం గట్టిగా అన్నాడు.

మూడు రోజుల్లో అహోబిలన్ అడిగిన డబ్బు కట్టాడు. తల్లి కళ్లలో కన్నీళ్లు తడవి వెంటాడుతూ వుండగా. తనకి తానే సమాధానం చెప్పుకున్నాడు. "కొన్నిరోజులే ఈ కష్టాలు... ఆ తర్వాత సదర్‌ఖాన్‌లా తనూ"

డబ్బు తీసుకుని అహోబిలన్ వెళ్లిపోయాడు...

నెలరోజుల తర్వాత భాస్కర్ రెడ్డికి ఉత్తరం వచ్చింది. "సౌదీనుంచి వచ్చిన డెలిగేష

## కంగారు

"అల్లుడూ! నువ్వు అమ్మాయి పండగకు వచ్చి మూడు మాసాలయ్యిందికదా, మీరింకా రాలేదని మీవాళ్లు కంగారుపడరూ!" అన్నాడు మామ.

"నిజమే మామయ్యా! ఆ మాట మరిచేపోయాము. ఈ రోజే టెలిగ్రాం ఇచ్చి మావాళ్లందర్నీ ఇక్కడకు రమ్మంటాము" చెప్పాడు అల్లుడు.

— ఖండవల్లి గౌతమి (హైదరాబాద్)



న్‌తో బాంబేలో ఇంటర్వ్యూ''

డబ్బు పోయిందని నిరాశపడుతున్న సమయంలో ఈ ఇంటర్వ్యూ కాల్ అహోబిలన్ చెప్పినది కరెక్టే — వీళ్లు మోసం చెయ్యరు!

బస్సెక్కి బొంబాయిలోదిగాడు. శాంతాక్రజ్ ఏరియా, హోటల్ ఏర్‌పోర్ట్‌లో ఇంటర్వ్యూ.

తనకున్న మంచి డ్రెస్ వేసుకుని వెళ్లాడు అక్కడ అహోబిలన్ కలిశాడు.

షేక్ ఉన్న గదిలోకి వెళ్లాడు రెడ్డి.

పది బై పదీ గది అది. ఏ.సి. వుంది. మంచంమీద కూర్చున్నాడు. షేక్ చేతిలో మద్యం గ్లాసు. హిందీ సినిమాల్లో వాంప్ వేషాలు వేసే గెటప్‌తో అర్థనగ్నంగా అతడి ఒడిలో ఒక సినీ స్త్రీ.

గతుక్కుమన్నాడు భాస్కర్‌రెడ్డి.

''బెదూన్'' కి సలామ్ చెప్పు'' అని గద్దించాడు అహోబిలన్.

''బెదూన్ — బెదూన్ ఏంటి'' రెడ్డి మనసులో ఆలోచన.

''వీళ్లు షేక్‌లుకాదు. బెదూన్‌లు. చెయ్యి''

నమస్కారం చెప్పబోయి, ఆగాడు. అహోబిలం కఠినమైన గొంతు విని ''నమస్కారం అనకు — చెయ్యి విరుస్తాడు. సలాం సలాం అను''

''సలాం'' చెప్పాడు రెడ్డి.

గ్లాసులో ఇంకొంచెం మద్యం పోసిచ్చింది ఆ వాంప్ ఎక్స్ట్రా. ప్లేటులో చికెన్ కొంచెం దూరంలో, మిక్చర్, జీడిపప్పు తినేయగా మిగిలిన ప్లేట్లు.

మత్తుగా ఆవలించి, అరబ్బీలో ఏదో అన్నాడు బెదూన్. ''జీ జీ'' అన్నాడు అహోబిలన్.

ఇంటర్వ్యూ అయిపోయింది. బయటకు వచ్చాడు రెడ్డి అహోబిలన్‌తో.

''ఒరే నువ్వు రొంబ లక్కీ! నువ్వు సెలక్ట్ అయినావు. ఆనాక సిన్న ప్రాబ్లెం'' అన్నాడు అహోబిలన్.

''ఈ బెదూన్‌కి మెయిన్ ఏజంట్ వేరే వుండాడు. సెలక్టు అయినవాండి దగ్గర్నుంచి వాడు ఇరవై వేలు అడుంగుమ. తెస్తివా. టిక్కెట్టు, వీసా ముట్టును. లేదా వట్టికి పోమా''

హతాశుడయ్యాడు. మరో ఇరవై వేలు. పదివేలు ముందే ఇచ్చాడు. ఇప్పుడిది.

''టిక్కెట్టు, నీ సాపాడు, వసతి — ఎల్లా ఫ్రీదానే — ప్లేనులో టిక్కెట్టు జాస్తి వుండునే. ఇరవై వేలు ఖర్చు అయ్‌పోవును''

కొన్ని గంటలు అంతర్‌మథనం తరువాత రెడ్డి నిర్ణయానికొచ్చాడు. తండ్రినొప్పించి ఇల్లు తనఖాపెట్టి...

నాలుగోరోజు ఇరవై వేలతో అహోబిలన్ ఎదుట ప్రత్యక్షమయ్యాడు రెడ్డి. అప్పటికే బెదూన్ సౌదీ వెళ్లిపోయాడు.

''నిండా సంతోషం. నీ ప్లేను ఇంకా మూడు గంటలలో వుంది. పోమి షార్ట్ ఏర్‌పోర్టుకు'' అన్నాడు అహోబిలన్.

భాస్కర్‌రెడ్డి సరిగ్గా తినలేదు. కాలే కడుపుతో విమానాశ్రయానికి వచ్చాడు.

అప్పటికే అహోబిలన్ అక్కడ వున్నాడు.

''అరే! ఏమ్‌రా నీకు బుద్ధిలేదా — ఇంత

లేట్ చేస్తివి. స్టుపిడ్. పోపో. ఇది నీ బోర్డింగ్ కార్డు. పాస్‌పోర్టు — పోపో — ఇంకా చూస్తువేంరా — విలేజ్ బ్రూట్" అవి తిడుతూ రెడ్డి చేతిలో ఒక బోర్డింగ్ కార్డు, పాస్‌పోర్టు కుక్కి లోపలికి తోశాడు.

కలలోలాగా రెడ్డి విమానాశ్రయంలో ప్రవేశించాడు. కన్వేయర్ బెల్టుమీద వుంచిన ట్రంకుపెట్టెలు కస్టమ్సునుంచి సెక్యూరిటీకి, సెక్యూరిటీనుంచి డిపార్చర్ హాలుకు, డిపార్చర్ హాలునుంచి విమానంలోకి చేరాడు

అప్పుడు చూశాడు పాస్‌పోర్టు.

తన పేరు స్థానంలో మరో పేరు. ఫోటో తనదే.

ఆ పేరు బషీరుద్దీన్ అల్ కలీల్ ఘూస్ వాలా"

తన పేరు ఇలా మార్చేశాడేమిటీ —

ఇంతలో ఎయిర్‌హోస్టెస్ చల్లని డ్రింక్ ఇచ్చింది. అవి తాగిన తర్వాత తట్టింది అతనికి అది ఫోర్జ్‌డ్ పాస్‌పోర్టు. ఫోటో తనది. పేరు ఎవరిదో.

అప్పుడు మొదలయింది భయం అతనిలో.

యాంత్రికంగా విమానంలో పెట్టిన భోజనం తిన్నాడు. రెండు జతల బట్టలున్న పాతపడిన తన సూట్‌కేసు చూసుకున్నాడు. దాంట్లో మడతలు పెట్టబడిన మాట ఏభై రూపాయల పది నోట్లు. ఈ పరిస్థితిలో ఈ ఫోర్జరీ సంగతి ఎవరికి చెప్పినా నమ్మరు.

వద్దున పడ్డ చేపలా వుంది అతని మనస్థితి. ఆలోచనలు, భయాలు.

ఒక్క కుదుపుతో విమానం రియాద్‌లో దిగింది.

మరోసారి కన్వేయర్ బెల్టుమీది సూట్‌కేసులా ఇమిగ్రేషన్ కస్టమ్స్ సెక్యూరిటీ ఎరైవల్ హాలులోకి వచ్చిపడ్డాడు.

రియాద్‌లో తనని తీసుకెళ్లడానికి 'బెదూన్' ఎవర్నైనా పంపిస్తాడు. లేదా తనే

## ఎగిరే పక్షి

*1934లో కాచార్ కొండలలో 3 కి.మీ.ల దూరం ఎగిరే పోటీలో పిట్టలోక వానకోవెల తక్కువ వస్తువులన్నింటికంటే ఎక్కువ వేగంగా గంటకి 276.5 మొదలు 353.3 మైళ్ల వేగంలో ఎగురుతుంది.*

— శ్రీశారద (వ్రాదేవుపల్లి)



వస్తాడు అని చెప్పాడు అహోబిలన్.

అక్కడే కూర్చున్నాడు రెడ్డి. గంటలు గడిచిపోతున్నాయ్. బెదూన్ జాడలేదు.

గత నాలుగైదు రోజులుగా నిద్రలేదు. సుషుప్తి... జాగృతిల మధ్య వూగుతుండగా, కఠోరమైన మాట వినపడింది. కళ్లు తెరిచాడు రెడ్డి.

ఎయిర్‌పోర్టు పోలీస్ — యమ కింకరుడిలా నిలబడి వున్నాడు ఎదురుగా అరబ్బీలో తిడుతూ రెడ్డి చొక్కా పట్టుకుని గుంజుతూ మూలగా వున్న ఒక గదిలో తోసేశాడు.అప్పటికే ఆ గదిలో బిక్కుబిక్కుమని చూస్తూ దాదాపు పదిమందివరకు వున్నారు.

క్రమంగా చీకటయింది. ఎయిర్‌పోర్టులో వెళ్లే విమానాల సందడి ఎక్కువైంది. నీరసంగా గోడకానుకుని ఆ రాత్రి గడిపేశారు. అక్కడున్న జనం. పరిచయాలమీద, ప్రసంగించడంమీద వాళ్లల్లో ఎవరికీ ఆసక్తి వున్నట్టులేదు. ఆకలి, నిస్సత్తువ, ఆందోళన, భవిష్యత్తు ఎలా వుంటుందోనన్న భయం.

తెల్లవారుతుండగా బెదూన్ వచ్చాడు. రెడ్డి ముఖం ఆనందంతో వికసించింది. పాస్‌పోర్టు చూపించమన్నాడు. చూపించడంతో గబుక్కున లాక్కుని తన అంగరాఖా జేబులో కుక్కుకున్నాడు. సైగచేసి తనతో రమ్మన్నాడు.

చేతిలో చిన్న పెట్టెతో బయటకు వచ్చాడు. బెదూన్‌తో బయటకురాగానే వెచ్చటి గాలి ముఖానికి తాకింది. బెదూన్ తన వాహనంలో కూర్చోమని సైగచేశాడు. ఓపెన్ టెంపో ఎక్కి పైన కూర్చున్నాడు. భరించరాని వాసన. ఒంటెల మలమూత్రాదులు, అక్కడంతా అసహ్యంగా.

రియాద్‌నుంచి 'అలఫ్ టయాల్' వగరం దిక్కుగా బెదూన్ లారీ వేగంగా దూసుకుపోతూ వుంది. పైన కాలుతున్న సూర్యుడు. అలసటతో నిద్రపోయాడు. సూర్యతాపం తెలియలేదు. కొన్ని గంటల ప్రయాణం తరువాత రోడ్డు దాటి ఎడారి ఇసుకలో ప్రవేశించింది బెదూన్ టెంపో. దాదాపు పదిహేను మైళ్ల దూరం ఎడారిలో దుమ్ము లేపుతూ టెంపో ఒక గుడారాల సముదాయం దగ్గర ఆగింది.

చిన్న నీటి గుంట. డీసెల్‌తో నడిచే పంప్‌సెట్. ఒంటెలు కట్టివేసి వున్నాయి. అవి అరమోడ్పు కన్నులతోఏదో అద్వితీయ సుఖాన్ని ఆనందిస్తున్నట్టున్నాయి. కొన్ని గుడారాల్లో సేవకులున్నారు. ఒంటె పాలు పితికే పెద్ద పెద్ద స్టీలు పాత్రలు... దూరంగా ఒంటెలనునరికేవధశాల... ఇనుప కంటేనర్లు, మాంసం సరఫరాకి.

ఒక గుడారంలో బెదూన్ కుటుంబంతో వుంటారు. పదిమందిదాకా పిల్లలు — మురికిగా మట్టిలో ఆడుతూ... నలుగురైదుగురు ఆడవాళ్లు బిలబిల్లాడుతూ బయటకు వచ్చారు. రెడ్డిని ఎగాదిగా చూశారు. నవ్వుకుంటూ వెళ్లిపోయారు.

ఒక గుడారంలో రెడ్డిని వుండమన్నాడు బెదూన్. ఇంకా ముగ్గురున్నారు. ఉర్దూ మాట విని ప్రాణం లేచివచ్చింది. తనకు కూడా ఉర్దూ వచ్చని చెప్పాడు వాళ్లతో రెడ్డి. ఎక్కడ్నుంచి వచ్చావని అడిగారు. ఇండియా అనగానే దూరంగా వెళ్లిపోయారు. వాళ్లంతా పాకిస్తానీయులు. ఈ హఠాత్ వైరానికి నిరు

ళ్ళాపాపడ్డాడు.

చీకటవడంతో ఒక అడుగు డయామీట ర్‌లో వుండే ఒక రొట్టె అతనికి పిదకు విసిరి వెళ్లిపోయాడు ఒక నౌకరు. అది 'కుబ్జూవ్' అవబడే గోధుమ రొట్టె. రొట్టె లో కుంకుడుకాయంత కారం, ఒక లోటా లో నీళ్ళు.

ఆవురావురవి ఆ రొట్టె తివ్నాదు. ఇంకా ఆకలే. పెరుగుతో గుప్పెడన్నం వుంటే.

రెడ్డికి అనుమానం వచ్చింది. తను సివిల్ ఇంజనీరు. భవన సముదాయాల్లో నిర్మాణపు పనులుచేసేచోట తన ఉద్యోగం అనుకున్నాడు. ఇదేమిటి? ఎడారి — గుడారా లు.

ఆ తెల్లవారితేగాని రెడ్డికి తెలియలేదు. అతని నిస్సారమైన జీవితంలో ఎన్నో నిరాశలు చవిచూశాడు. అయితే ఆ రాత్రి దాటిన తర్వాత ఎదురైన అనుభవం వెయ్యి జన్మలెత్తి నా మరచిపోలేనిది. అతని ఆశల భవనానికి పునాదులుకాదుకదా, ఎంబెట్టే భూమే కనబ డలేదు.


o p o

బలంగా డొక్కలో ఎవరో తన్నారు. శూలంపెట్టి పొడిచినట్టు డొక్కలో బాధ. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

మరో కుబ్జూవ్ రొట్టె అతని మొహాన్న విసిరి, అరబ్బీలో ఏదో అరిచి వెళ్లిపోయాడు బెదూవ్. బయటకు ఇంకా చీకట్లున్నాయి. చేతికున్న పాత గడియారంకేసి చూశాడు. అది లేదు. రోజుకు పది నిమిషాలు ఫాస్ట్ తిరిగే మెకానికల్ గడియారం. ఉజ్జాయింపు గా ఉదయం నాలుగై వుంటుందనుకున్నాడు

"ఏ! సాలా! ఏక్ దిన్ సమూన్ దేతే" గొణుక్కుంటున్నాడు ఒక పాకిస్థానీ. సమూ న్ బ్రెడ్‌లా వుంటుంది. కొంచెం రుచిగా.

పెట్టెలో బ్రష్, పేస్ట్ తీసుకుందామని పెట్టె తెరిచాడు. అది ఖాళీ, ఒక లుంగీ,



వంచె తువ్వాలుతప్ప బట్టలు లేవు. అర్థమైంది రెడ్డికి. తన వాచీ, బట్టలు ఎవరో దొంగిలించారు. పేస్టు, బ్రష్‌కూడా.

నీళ్ల తొట్టెలో నీళ్లు పంప్ చేయబడుతున్నాయి. వట్టి వేలితో పళ్లు తోముకున్నాడు. రెండు లోటాల నీళ్లు మొహంమీద గుమ్మరించుకున్నాడు. గ్యాస్‌లైట్లవల్ల అక్కడంతా వెలుతురుగా వున్నా, ఎడారంతా చీకటి.

బెదూన్ భయంకరంగా అరుస్తూ వచ్చాడు. ముగ్గురు పాకిస్తానీయుల్లో ఒకరు రెడ్డి చేతిలో చీపురు పెట్టారు. "కానీ" అని సైగ చేశాడు.

'బెదూన్' అంటే వాళ్లకీ పడదు. అయోమయంగా, అమాయకంగా వున్న రెడ్డిని చూసి వాళ్లలో ఒకడికి జాలి వేసింది.

"ఇంతకుముందు ఎక్కడ పనిచేశావు? పశువుల కొట్టాలు, పాయఖానాలు శుభ్రం చేయడం వచ్చా?" అడిగాడు.

షాక్... షాక్... షాక్...

పశువుల కొట్టాలు అంటే ఒంటెల మలమూత్రాలు తుడావాలా? ఎత్తాలా? మనుషుల పాయఖానాలు — అన్నేళ్ల చదువూ, ఇక్కడకు రావడానికి పడ్డ కష్టమూ ఇందుకా?

"బెదూన్" చేతిలో కొరడా వీపుమీద కాల్చిన ఇనుపరాడ్‌లా తగలడంతో రెడ్డి తుడవడం ప్రారంభించాడు. ఒంటెల పెంటికలు, ఉచ్చలు, అవి తిని వదిలేసిన దిగుమతి చేసుకున్న ఎండుగడ్డి—

తెల్లవారింది — ఆవరణ తుడవడం పూర్తయింది. మిగిలిన నౌకర్లు ఒంటెల పాలు పిండి కేనుల్లో నింపుతున్నారు. దూరంగా తల వరకబడ్డ ఒంటె ఆర్తనాదం హృదయ విదారకంగా.

"ఇక ఆ దొడ్లు శుభ్రం చెయ్యి" అన్నాడు బెదూన్. టెంపరరీ లేవ్రటీస్ గుడారాలకు రెండు ఫర్లాంగుల దూరంలో.

అక్కడకు చీపురుతో వెడుతూ మొట్టమొదటిసారి బిగ్గరగా ఏడ్చాడు "అమ్మా" గొంతు చించుకుని, ఎడారి ప్రతిధ్వనించేలా ఏడ్చాడు. "అమ్మా... అమ్మా" వెనుక బెదూన్ కొరడా ధ్వని వినిపించి గబగబా ఆ టాయిలెట్లను శుభ్రం చేయడం మొదలుపెట్టాడు. కళ్లు మూసుకుని ఊపిరి పీల్చడం ఆపి —

పది గంటలయింది. బెదూన్ ఒంటెలను వదిలేశాడు అప్పటికే.

"ఇప్పుడు వాటి వెనకాలే వాటిని తోలుకురా" అన్నాడు కఠినంగా.

"ఎటువెళ్లాయి" కొంత సైగలతో, కొంత తనకు వచ్చిన ఇంగ్లీషు, ఉర్దూలతో.

"వంటెల పాదాల గుర్తులు వెతుక్కుంటూ వెళ్లు — ఎడారిలో వున్న ముళ్లపొదలు తింటూ వెడ్తాయి"

బెదూన్ కొరడాదెబ్బ శరీరంమీద గాయం చేసినట్టుంది.

"ఎండ వేడికి, ఉక్కకు అది చిరచిరమంటోంది.

నడక ప్రారంభించాడు ఎడారిలో. ఎండ వేడి తట్టుకోలేక చొక్కా విప్పి తలకు చుట్టుకున్నాడు.

మధ్యందిన మార్తాండుడు వెలరేగుతున్నాడు. కొలిమిలా వుంది ఎడారి. ఉన్నట్టుండి

గాలి విజృంభిస్తోంది. సన్నటి ఇసుక లేచిపడ్తోంది. కాలిన ఇనుపరజను కొట్టినట్టు, అతని ముఖాన్ని ఇసుక కొట్టుకుంటోంది.

మూడు గంటల తర్వాత కనపడింది ఒంటెల గుంపు. వచ్చిన దారి గుర్తుపెట్టుకోవడం మంచిదయింది. సూర్యగమనాన్ని బట్టి దిక్కులునిర్ణయించుకుని ఒంటెల గుంపును అదిలిస్తూ గుడారం చేరుకున్నాడు.

దాహంతో గొంతు ఎండిపోతోంది. నీళ్ల టాంకులో నీళ్లున్నాయి. మురికిగా వాచుతో ఎండవేడికి ఉడుకెక్కిపోయి.

ఆత్రంగా నీళ్లు తాగాడు రెడ్డి.

బెదూన్ భయంకర నాదం విని బిత్తరపోయాడు. కోడెత్రాచులా అతని చేతిలో కొరడా.

"'ఏమైంది? తన వల్ల తప్పేం జరిగింది' ఆ ఆలోచనలు కొన్ని క్షణాలే.

నిప్పులువానకురిసినట్టు, ముళ్లకంపలమీద శరీరం ఈడ్చినట్టు ఒళ్లు రక్తాలు వచ్చేటట్టు — ఎడతెరిపిలేకుండా కొట్టాడు బెదూన్. కొద్ది నిమిషాలే అది. స్పృహతప్పిపోతూ చూశాడు. ఒక పాకిస్థానీ బెదూన్‌ని అడ్డుకుంటున్నాడు.

o p o

అతనికి స్పృహ వచ్చేసరికి మర్నాడు మధ్యాహ్నమైపోయింది.

జ్వరంతో వళ్లు కాలిపోతూ వుంది. తన మీదకు వంగి చూస్తున్న పాకిస్థానీ తను కళ్లు తెరవడం చూసి, పైకి రెండు చేతులూ ఎత్తి ప్రార్థించాడు.

"నువ్వు హిందువా?" హఠాత్తుగా అడిగాడు వాడు.

రెడ్డికి గుర్తొచ్చింది. ఫోర్జరీ చేసిన పాస్‌పోర్టులో తన పేరు. ఇక దాచి ప్రయోజనంలేదు.

నెమ్మదిగా అంతా చెప్పాడు. ఇంజనీరింగ్ చదవడానికి తను పడ్డ కష్టాలు. ఉద్యోగం

## గాడిద


"గాడిదముందు ఓ కుప్పెలో నీరు, మరో కుప్పెలో బీరు పోసి పెడితే అది ఏది తాగుతుంది?" అడిగాడు భీమారావు.

"ఖచ్చితంగా నీళ్లనే తాగుతుంది" చెప్పాడు రామారావు.

"నీళ్లే ఎందుకు తాగుతుంది?"

"అదెలాగూ 'గాడిద' కనుక"

— వాసాల విజయకుమార్ (కోరుట్ల)



దొరక్క పడ్డ పాట్లు, మంచి జీతం అని నమ్మించి తననిక్కడకు పంపిన బ్రోకర్లు — తన పాస్‌పోర్టు బెదూన్ లాక్కోవడం.

అంతావిని ఆ పాకిస్తానీ అన్నాడు. "నేను ముందే అనుకున్నాను నువ్వు చదువుకున్నవాడివని. దేశంలో తిండిలేక ఇక్కడ మంచి జీతం వస్తుందని మేమూ వచ్చాం. చూస్తున్నావుగా నువ్వు హిందూవన్న విషయం నువ్వు నీళ్ల తాగినప్పుడు అర్థమైంది. ఇది రంజాన్ మాసం. పగలు పచ్చి మంచినీళ్లు తాగకూడదు. అందుకే బెదూన్ ఉగ్రుడయ్యాడు"

రెడ్డికి ఇప్పుడర్థమైంది. తనను ఎందుకు కుళ్లబొడిచాడో!

"బెదూన్ క్రూరుడు. నువ్వు చస్తే పాతిపెట్టమని నాకు చెప్పాడు. చావకపోతే అలాగే పాతమన్నాడు. రియాద్‌కి తన వ్యాన్‌లో వెళ్లాడు పాలూ, మాంసం తీసుకుని. నువ్వు వెళ్లిపో. ఇక్కడుంటే చచ్చిపోతావ్"

నీరసంగా అన్నాడు రెడ్డి "నా పాస్‌పోర్టు'

"వాటిగురించి ఆగితే బెదూన్ తన వాడిగోళ్లతో నిన్ను చీల్చేస్తాడు. నిన్న చూసిన దారమ్మటే పదిహేనుమైళ్లు వెళ్లు మెయిన్ రోడ్డు వస్తుంది. ఎన్నో ట్రక్కులు రియాద్ వైపు వెడుతూంటాయి. వాటిలో లిఫ్టు అడుగు. ఎవడో ఒకడు దయతలచకపోడు"

లేవబోయాడు రెడ్డి. వళ్లు స్వాధీనంలో లేదు.

"పో. పో. మళ్లీ బెదూన్ వచ్చేస్తాడు. అతను వచ్చేలోపల గుడారం బయటకు పో. అతని వ్యాన్ వచ్చేవరకు ఎక్కడో దాక్కో. రాత్రి ప్రయాణం మంచిది. చలి ఎక్కువ. ఎడారి తేళ్లు, పాములూ వుంటాయి జాగ్రత్త నీ బట్టలు తీసుకో"

"ఇవి—"

ఆ పాకిస్తానీ సిగ్గుపడుతూ అన్నాడు "నీ బట్టలూ,వాచీ, టూత్‌పేస్టూ తీసింది మేమే — మాఫ్‌కర్‌నా—"

"రియాద్‌లో ఇండియన్ డాక్టర్లున్నారు వాళ్లకు నీగురించి చెప్పుకో ట్రీట్‌మెంట్ ఇస్తారు"

రెడ్డి బలవంతంగా లేచి నిలబడ్డాడు. మృత్యుభయం మిగిలిన బాధల్ని తెలియనివ్వలేదు. పాకిస్థానీ తిరిగి ఇచ్చేసిన బట్టలు పెట్టెలో పెట్టుకున్నాడు. దుప్పటి కప్పుకున్నాడు. గుడారం బయటకు వచ్చాడు.

దూరంగా వ్యాన్ వస్తున్న చప్పుడయింది .. ఒక గుడారం పక్కకు తప్పుకున్నాడు.

"ఆరోగ్యం కుదుటపడ్డ తర్వాత మీ దేశపు ఎంబసీకి వెళ్లు — వాళ్లు తిప్పి పంపుతారు — ఖుదా వాఫీస్" అన్నాడు పాకిస్థానీ.

ఎడారిలో సూర్యాస్తమయమవుతోంది. బతుకుమీద తీపి అతన్ని కదిలిస్తూ వుంటే నెమ్మదిగా కదిలాడు విశాలమైన ఎడారిలోకి.

చెయ్యెత్తి శలవు తీసుకున్నాడు రెడ్డి — ఆ పాకిస్థానీ... దేముడిలా కనపడ్డాడు.